ఉపాధ్యాయ పోస్టులను రేషనలైజ్ చేయాలి

వనస్థలిపురం: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులను రేషనలైజ్ చేసి, బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన జెడ్పీహెచ్‌ఎస్ సాహెబ్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ పాఠశాలల్లో పర్యటించి మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎక్కువగా ఉండి ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో వారికి నాణ్యమైన విద్యా అందడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతుందని, ఉమ్మడి ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులు, ఎంఈఓ, జీఎల్, డైట్ లెక్చరర్లకు పదోన్నతులు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దీనదయాళ్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సేవాభావం ఉండాలి


అనాథ ఆశ్రమానికి సామగ్రి అందజేస్తున్న విద్యార్థులు

హస్తినాపురం: సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. విఠల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సాగర్‌రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ కాన్సెప్ట్ స్కూలు విద్యార్థులు కీర్తన అనాథ ఆశ్రమానికి 6 క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటళ్ల కందిపప్పు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు సమాజం పట్ల అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థలో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజని శేషారావు, రాజశేఖర్, విజయ్‌కుమార్‌రావు, సునిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక పాల్గొన్నారు.

కోర్టు తీర్పు, శాసనసభ తీర్మానాన్ని అమలు చేయని అధికారులు

చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్


సమావేశంలో పాల్గొన్న రంగరాజన్

నాగోలు: సుప్రీంకోర్టు తీర్పు, శాసనసభ తీర్మానాన్ని అధికారులు అమలు చేయకుండా తెలంగాణ ఇనాంధారుల అర్చక సమైక్యను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు, సంఘం గౌరవ అధ్యక్షులు రంగరాజన్ అన్నారు. తెలంగాణ ఇనాంధారుల వంశపారంపర్య అర్చక సమైక్య సమావేశం బుధవారం ఎల్‌బీనగర్‌లోని తెలంగాణ శ్రీవైష్ణవ సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అర్చకుల హక్కులు, ఇనాం భూముల సంరక్షణ, పలు సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. అర్చకుల పోరాటాలతో 2007లో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం 30/87 జీవోను 33 /2007గా సవరించిందన్నారు. ఇప్పటికి 17 ఏళ్లు కావస్తున్నా సవరించిన చట్టాన్ని అధికారులు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆలయాల భూములు ధరణిలో ఇనాంధార్ అనుభవదారుడి కాలం పహానిల నుంచి తొలగించడంతో గ్రామాలలోని వంశపారంపర్య అర్చకులు లబ్ధి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సవరించిన ఈ చట్టాన్ని ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అర్చక సమాఖ్య అధ్యక్షులు యాదగిరిగుట్ట రిటైర్డ్ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు రామానుజచారి, ఎస్వీ చారి, పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి



నాగోలు: మొక్కలు నాటడం పౌరుడు బాధ్యతగా భావించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. మన్సూరాబాద్ డివిజన్, బిగ్ బజార్ రోడ్డు సాయిబాబా ఆలయ సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యంతో ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనుపమ, ఉపాధ్యాయులు, నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

క్రైస్తవ జీవన విధానంలో ప్రార్థన ప్రాణం లాంటిది


ప్రార్థన యాగం పూర్తి చేసుకున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: క్రైస్తవ జీవన విధానంలో ప్రార్థన ప్రాణం లాంటిదని దైవ సేవకులు రెవరెండ్ యేసుపాదం అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ క్రైస్తవ సంక్షేమ సంఘం నిరంతర ప్రార్థన యాగం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టర్.జాకబ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవుడు ప్రజలను ప్రేమించేవాడని ప్రార్థన ద్వారా వారికి సమీపమై బలపరుస్తూ కాపాడతారన్నారు. జాకబ్ మాట్లాడుతూ.. ప్రపంచమంతా కోవిడ్‌తో పీడించబడుతున్న సమయంలో దేశ స్వస్థత–సంఘం క్షేమం, అభివృద్ధి కోసం ప్రార్థన చేయబట్టి నేటికి 1000 రోజులు అయిందని దాని కోసం అనేక వందల మంది దైవసేవకులు, సువార్తీకులు ప్రతి రోజూ ప్రార్థన చేస్తున్నారన్నారు. ఈ అసోసియేషన్ ద్వారా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఐక్యత బలం తమ ఉద్దేశమని సంఘం అధ్యక్షుడు యం.దేవానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీవీ ప్రసాద్, కొత్తపల్లి జోసెఫ్, యేసుపాదం, దీపికా, సన్నీ, ఆనంద్, మోసెస్, ఇస్సాకు, నవీన్, పరమేశ్వర రెడ్డి, సురేష్, ఎఫ్రా, శిఖామణి పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి


మోహన్‌రెడ్డి, చంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది

మహేశ్వరం: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్, మెకానికల్ సూపరిండెంట్ పి.చంద్రయ్య పదవీ విరమణ సందర్భంగా ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది ఘనంగా వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది వృత్తిపరంగా అన్నివిధాలుగా సహకరించారన్నారు. రాష్ట్రంలోని మహేశ్వరం డిపోను లాభాల్లో మొదటి స్థానంలో నిలబెట్టడంతో పాటు గోల్డ్‌మెడల్ అవార్డు అందరి సహకారంతో రావడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. మహేశ్వరం డిపోను అన్ని రంగాల్లో ముందుండి నడిపి అదాయం తీసుకొచ్చి ప్రభుత్వానికి లాభాలు తీసుకొచ్చామన్నారు. పదవీ విరమణ పొందుతున్నందుకు బాధగా ఉందన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. అంతకు ముందు కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది పూలు, శాలువాలు, జ్ఞాపికలతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లపై మురుగు.. పరిష్కారం దేవుడెరుగు!

- పొంగుతున్న డ్రైనేజీలు
- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కాలనీ వాసులు

నాగోలు: హయత్‌నగర్ సర్కిల్ పరిధి నాగోలు డివిజన్‌లో ఎక్కడ చూసిన డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు ఏరులై పారుతోంది. కనీసం అడుగు వేసేందుకు కూడా వీలులేని దుస్థితితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని బస్తీ, కాలనీవాసులు వాపోతున్నారు. ఈ సమస్యపై జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో మొర పెట్టుకున్నా స్పందన కరువవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ చౌరస్తా, గోపాలకృష్ణపురం, అయ్యప్పనగర్ కాలనీ, మల్లికార్జుననగర్, శ్రీనివాస్‌నగర్, మమతనగర్, అనంతుల కాలనీ, జైపురికాలనీ కాలనీల్లో ఎటు చేసినా మురుగు పారుతూ దుర్గంధంతో నిండిపోయింది. సాయినగర్ కాలనీలో రోడ్డు నెంబర్–3లో గత నెల రోజులుగా డ్రైనేజీ పొంగి ఘటైనా వాసనతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం దీనికి తోడు రోడ్లపై పారుతున్న మురుగు, వరదతో కలిసి ఇళ్ల పరిసరాల్లోకి వస్తోంది. ఇళ్ల ముందు నిలుస్తున్న మురుగుతో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్న ప్రజాప్రతినిధులు తమ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తే ఏ మాత్రం స్పందించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


రోడ్డు పక్కన ఇలా..

తాగునీటిలో కలిసి..

నాగోలు డివిజన్ పరిధిలో వివిధ కాలనీలో ఓ పక్క డ్రైనేజీ పొంగి పొర్లుతుండగా మరో పక్క తాగునీరు పైప్‌లైన్ నుంచి నీరు లీకై విలువైన నీరంతా వృథా అవుతోంది. నాగోలు సాయినగర్ రోడ్డు నెంబర్ 1 నుంచి 3 వరకు గత 20 రోజులు నుంచి తాగు నీరంతా వృథాగా పారుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగునీరు సైతం పైపులలో చేరి తాగు నీటితో కలిసి సరఫరా అవుతోందని పలు కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బస్తీ, కాలనీల వాసులు కోరుతున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు రూ. 30, వంకాయ రూ. 28, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 40, క్యాబేజీ రూ. 20, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 37, దొండ రూ. 35–40, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 11, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40.
ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

11న భాగవత పద్యాల పోటీలు

నాగోలు: కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 భాగవత పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జ్ఞానకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల లోపు పిల్లలు అర్హులని ఒక్కొక్కరు ఒక పద్యం పాడి దాని అర్థం కూడా వివరించాలన్నారు. ఆసక్తి ఉన్న చిన్నారులు ఈ నెల 8వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం యూ ట్యూబ్ ద్వారా ప్రత్యేక ప్రసారం జరుగుతుందన్నారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోలులోని కొమర్రాజు ఫౌండేషన్ భవనంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని మరింతా సమాచారం కోసం 824756 9708, 97041 75183 నంబర్లను సంప్రదించాలన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నాగోలు: చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పెద్దపూరే బ్రహ్మయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా భావితరాలకు మనమే అవకాశం కల్పించిన వారవుతామన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయాలని, గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి అన్ని వసతులను కల్పించాలన్నారు. గతంలో బీసీ రుణాలకు 5.27 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 55 వేల మందికి రూ.50 వేలు మాత్రమే ఇచ్చారని దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

వికలాంగులకు చేయూత కార్యక్రమం వాయిదా

చాదర్‌ఘాట్: వికలాంగుల సమస్యలు తెలుసుకునేందుకు మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థలో ఆగస్టు 1న ఏర్పాటు చేసిన వికలాంగులకు చేయూత కార్యక్రమం వాయిదా పడిందని సంస్థ చైర్మన్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల ద్వారా వాయిదా పడిన ఈ కార్యక్రమంపై సమగ్రంగా చర్చించి త్వరలో తేదీలు ఖరారు చేస్తామన్నారు. 8 నుంచి డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం యధావిధిగా కొనసాగిస్తామన్నారు.

ఆస్తి పన్నుపై స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు మలక్‌పేట సర్కిల్‌లో ఆస్తిపన్నుపై నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ ద్వారా దాదాపు రూ.26 లక్షల ఆదాయం వచ్చిందని సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తక్కువ పన్ను చెల్లించిన ఇళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సర్కిల్–6లో దాదాపు 13000 మంది వినియోగదారులు తక్కువ పన్నులు చెల్లించారన్నారు. ఇప్పటి వరకు 1200 ఇళ్లు పూర్తి చేసామని ఆగస్టు 10 వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

రోడ్లపై గుంతలను పూడ్చాలి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: బోనాల పండుగ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లో బుధవారం ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో వచ్చే ఆదివారం బోనాల పండుగ ఉందని గతంలో డ్రైనేజీ లైన్ వేసి ప్యాచ్ వర్క్ చేయకుండా వదిలేయడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అదే విధంగా రోడ్డు పక్కనే ఉన్న మట్టి కుప్పలను తరలించాలన్నారు. కార్పొరేటర్ వెంట భూపాల్ యాదవ్, క్రిష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: శాసనసభలో మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీ–ఫామ్‌పై పోటీ చేసి గెలిచిన సబితాఇంద్రారెడ్డిని విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. బీఆర్‌ఎస్ బీ–ఫామ్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారందరితో వెంటనే రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడానికి మహిళలే ప్రధాన కారణమని, అలాంటి మహిళలను బాధ పెట్టడం తగదని వెంటనే తెలంగాణ మహిళా సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగేష్, శ్రీనివాస్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రావు, శేఖర్, జగన్మోహన్ రెడ్డి, శ్యామ్ గుప్తా, శ్రీరాములు, జహీర్, మురళీధర్ రెడ్డి నవీన్ గౌడ్, అనురాధ, రోజా, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటుకు పరిశీలన

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు కోసం బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసాద్‌రావు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో అక్కడ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. త్వరలోనే ఆనంద్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ జంక్షన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆయన వెంట హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డుల అందజేత


చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సిటీ డిపోలో బుధవారం నిర్వహించిన ప్రమాద నివారణ వారోత్సవాల్లో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ పాల్గొని ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, ఏఎంటి వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, డిపో సిబ్బంది బుచ్చిరెడ్డి, శృతి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నాగోలు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బండ్లగూడ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటలకు వరకు కార్యక్రమం కొనసాగుతుందని ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఉన్న 9959224058 నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి



కందుకూరు: నెట్ జీరో సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమం, అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి కోరారు. బుధవారం సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని సీఎం రెండో హైదరాబాద్ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాను రద్దు చేశారన్నారు. ఇక్కడే ఇంటర్‌నేషనల్ స్థాయిలో పాఠశాలను ఏర్పాటు చేసి, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ సైతం ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బడంగ్‌పేట చైర్‌పర్సన్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి, కృష్ణనాయక్, కృష్ణరాంభూపాల్‌రెడ్డి, చిర్ర సాయిలు, ఎస్.వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి


డీసీ జయంత్

చాదర్‌ఘాట్: పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని మలక్‌పేట డిప్యూటీ కమిషనర్ జయంత్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోల హాజరు పట్టిక తప్పనిసరిగా సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని ఏఎంహెచ్‌ఓకు సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలని శానిటేషన్ విషయంలో ఏమాత్రం అధికారులు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న నూతన సభ్యులు

నాగోలు: నాగోలు డివిజన్ జైపూర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో బుధవారం బీఆర్ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. సీతారామచంద్రస్వామి దేవాలయం డైరెక్టర్ గోల్కొండ మైసయ్య నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా దప్పు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కత్తుల అనిల్‌కుమార్, కోశాధికారిగా డబ్బు సాయికిరణ్, ఉపాధ్యక్షులుగా సగ్గ వేణుగోపాల్, దప్పు సాయిరాం, గట్టు శివకుమార్, పిల్లాయిపల్లి నరసింహ, ఎడ్ల పరమేష్, సగ్గ రాజేష్, ఉప కోశాధికారులుగా ఎడ్ల మధుసూదన్, చిత్రంసాయి, జాయింట్ సెక్రటరీలుగా వంగ శ్రీకాంత్, నరుకుడు జనార్దన్, గట్టు హరినాథ్, పంగ రేవంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చిత్రం విజయ్ కుమార్, దప్పు కమలాకర్, మహేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

రోడ్లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు


ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

లింగోజీగూడ: వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు, షెడ్డుల ఏర్పాటు, సైన్ బోర్డులను పెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరించారు. ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్డులు, ర్యాంప్, సైన్ బోర్డులను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులతో కలిసి తొలిగించారు. రోడ్డు ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పదవీ విరమణ


వెంకటరాములును సన్మానిస్తున్న చైర్మన్ వీరయ్య

చాదర్‌ఘాట్: వికలాంగుల సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరలో పీఆర్‌సీలు ఇస్తామని సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థలో హెల్పర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వెంకటరమణ వీడ్కోలు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికలాంగుల సహకార సంస్థలో వెంకటరమణ సేవలు మరువలేనివన్నారు. కోర్టు కేసులో ఉన్న ఉద్యోగులకు కూడా పీఆర్‌సీలు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంస్థ బలోపేతానికి ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రభంజన్ రావు, ఉద్యోగులు రాము, చారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల అదృశ్యం


సాంబలక్ష్మి

నాగోలు: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మమతనగర్ కాలనీ చెందిన సాంబలక్ష్మి(51) కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతోంది. గత నెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సాంబలక్ష్మి ఎంతకీ తిరిగి రాకపోవడంతో భర్త రామమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెత్త వేయడానికి వెళ్లిన గృహిణి..


లక్ష్మమ్మ

చెత్త వేయడానికి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైంది. నల్గొండ జిల్లా, మర్రిగూడం మండలం, కొడస్పల్లికి చెందిన తాండారుపల్లి లక్ష్మమ్మ(45) భర్త ఇస్తారితో కలిసి నాగోలు సాయినగర్ కాలనీ రోడ్డు–3లో ఉంటున్నారు. లక్ష్మమ్మ ఖైరతాబాద్‌లోని దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో అటెండర్‌గా పని చేస్తోంది. గత నెల 29న భార్యాభర్తల మధ్య వ్యవసాయ భూమి విషయంలో చిన్న గొడవ జరిగింది. 30న చెత్త వేయడానికి బయటకు వెళ్లిన లక్ష్మమ్మ ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెడికల్‌షాపునకు వెళ్లిన యువతి..


భార్గవి

చైతన్యపురి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణ వివరాల ప్రకారం.. శాంతినికేతన్ స్కూల్ సమీపంలో నివసించే భార్గవి అలియాస్ పండు (19) మంగళవారం రాత్రి 8 గంటలకు తల్లికి మందులు తేవటం కోసం మెడికల్ దుకాణానికి వెళ్లింది. ఎంత సేపైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.